ప్రజాశక్తి

శనివారం 30 ఆగస్టు 2025 | 5 | విజయనగరం

వినాయక మండపాల వద్ద జాగ్రత్తలు తప్పనిసరి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వినాయక చవితి మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని విద్యుత్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు విజయనగరం సర్కిల్ ఎస్ఇ ఎం.లక్ష్మణరావు తెలిపారు. విద్యుత్ శాఖ పేర్కొన్న సూచనలను పాటించి గణేష్ ఉత్సవాలను సురక్షితంగా, ఆనందకరంగా జరుపుకోవాలని ప్రజలను కోరారు. మండపాలకు తాత్కాలిక విద్యుత్ సరఫరా కోసం అధికారిక కనెక్షన్లు మాత్రమే తీసుకోవాలని, అనధికారిక కనెక్షన్లు లేదా విద్యుత్ దొంగతనం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. పిల్లలను మీటర్లు, వైర్ల దగ్గరకి అనుమతించవద్దు. మండపాల్లో ఫ్యాన్లు, లైట్లు వాడేటప్పుడు ఓవర్ లోడ్ చేయకూడదని తెలిపారు. గణేష్ విగ్రహాలను తరలించేటప్పుడు విద్యుత్ లైన్లకు తగలకుండా జాగ్రత్త వహించాలని ప్రజలను కోరారు. విద్యుత్ శాఖ హెల్ప్ లైన్ నంబర్ 1912కు అత్యవసర సమయాల్లో సంప్రదించాలని తెలిపారు.

విజృంభిస్తున్న జ్వరాలు

రోగులతో ప్రయివేట్, ప్రభుత్వ ఆసుపత్రులు కిటకిట

శృంగవరపుకోట ఏరియా ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్న రోగులు

ప్రజాశక్తి-బొబ్బిలి/శృంగవరపుకోట/గజపతినగరం

ఇటీవల వర్షాలు విస్తారంగా కురవడంతో జ్వరాలు విజృంభిస్తున్నాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో జ్వరాలు తీవ్రంగా ఉండడంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. బొబ్బిలిలో ఉన్న ప్రైవేట్ ఆసుపత్రులకు రోజుకు 600 నుంచి 800 వరకు రోగులు వచ్చి చికిత్స పొందగా సిహెచ్‌సికి రోజుకు 500నుంచి 600మంది వరకు ఔట్ పేషెంట్లుగా వస్తున్నారు. వర్షాలతో వాతావరణం మారడంతో మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ, గొంతు జ్వరాలు, డయేరియా బారిన ప్రజలు పడుతున్నారు. అపారిశుధ్యం వలనే వ్యాధులు ప్రబలుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వర్షాలు అధికంగా కురవడంతో దోమలు, ఈగలు వృద్ధి చెంది ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని సిహెచ్‌సి వైద్యులు రెడ్డి కృష్ణకుమార్ తెలిపారు. బయట ఆహారాన్ని తీసుకోకుండా వేడి చేసి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. పరిసరాలను, బాత్ రూములను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సాధారణ జ్వరం వస్తే 24 గంటల్లో తగ్గకపోతే వైద్యులను సంప్రదించాలన్నారు.

గజపతినగరం ఏరియా ఆస్పత్రిలో కుర్చీలు లేక నేలపైనే కూర్చున్న రోగులు

వైద్యం అంతంత మాత్రమే

శృంగవరపుకోట ఏరియా ఆసుపత్రి రోగులతో కిటకిటలాడుతుంది. అరకు ఎస్‌కోట ముఖద్వారంగా ఉన్న ఎస్ కోట ఏరియా ఆసుపత్రికి నియోజకవర్గంలోని గ్రామాల నుండే కాకుండా ఎఎస్ఆర్ జిల్లా, అనంతగిరి మండల పరిధిలోగల గ్రామాల నుంచి కూడా రోగులు వస్తున్నారు. ప్రస్తుతం ప్రతిరోజు 400 నుంచి 450 వరకు ఓపి నమోదు అవుతుంది. వంద పడకల కోసం నిర్మిస్తున్న భవనం పూర్తి కాకపోవడం, రోగుల తాకిడి పెరగడంతో ఆసుపత్రి కిటకిటలాడుతోంది. దీంతో ఒక బెడ్ పై ఇద్దరు చొప్పున రోగులను సర్దుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అదనపు భవనాలను త్వరగతిన పూర్తిచేసి ప్రారంభించి రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలను అందించాలని రోగులు కోరుతున్నారు.

శృంగవరపుకోట ఆస్పత్రిలో ఒకే బెడ్‌పై ఇద్దరు రోగులు

పెరుగుతున్న రోగులు

గజపతినగరం ఏరియా ఆస్పత్రిలో రోజురోజుకూ రోగులు పెరుగుతున్నారు. అరకొర వసతులు ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోగుల తాకిడి మరింత పెరిగింది. ప్రతిరోజు అన్ని విభాగాలు కలిపి 250 నుంచి 300 ఒపి నమోదు అవుతోంది.. కంటి, ఆర్థోపెడిక్ విభాగాలకు సంబంధించి సదరన్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరగడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారితో మరింత రద్దీ పెరిగింది. ఆసుపత్రిలో రోగులకు, వారికి తోడుగా వచ్చే బంధువులకు సరిపడే కుర్చీలు, టేబుల్స్ లేకపోవడంతో గంటల తరబడి నిలుచుని ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రతిరోజు పదుల సంఖ్యలో రక్త, మూత్ర పరీక్షలు చేసే గది ఇరుకుగా ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏరియా ఆసుపత్రిగా హోదా పెరిగినప్పటికీ రోగులకు కల్పించే వసతులు అరకొరగా ఉన్నాయి. పలువురు డాక్టర్లు స్థానికంగా లేకపోవడం, మరి కొంతమంది సమీపంలోనే క్లినిక్‌లు ఏర్పాటు చేసుకొని ఆసుపత్రికి వచ్చే రోగులను వారి సొంత క్లినిక్‌లకు రిఫర్ చేయడంతో సక్రమంగా వైద్య సేవలు అందడం లేదు. దీనికి తోడు సిబ్బంది సమయపాలన పాటించడం లేదంటూ విమర్శలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బొబ్బిలి ఏరియా ఆస్పత్రిలో కిటకిటలాడుతున్న రోగులు

ప్రకృతి వ్యవసాయ పంటలలో పురుగులు, తెగుళ్ల యాజమాన్య దీపిక పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ప్రకృతి సాగు పెంచాలి

సర్వే కోసం జిల్లాలో 290 క్లస్టర్ల గుర్తింపు : కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో ప్రకృతి వ్యవసాయం సాగు పెంచడానికి రైతులలో అవగాహన కలిగించాలని కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రస్తుతం సాగు చేస్తున్న రైతులు కాకుండా కొత్త గ్రామాల్లో సర్వే చేసి కొత్త రైతులను గుర్తించి , వచ్చే రబీ నుండి సాగు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్‌లో ప్రకృతి వ్యవసాయంపై వ్యవసాయ, అనుబంధ శాఖలతో జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ మండల స్థాయిలో 3 రోజుల పాటు సమావేశాలు ఏర్పాటు చేయాలని, తరువాత గ్రామస్థాయిలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం వలన కలిగే లాభాలను రైతులకు వివరించాలని తెలిపారు. రైతుల నుండి సలహాలు, సూచనలు కూడా తీసుకోవాలని, ప్రజాభిప్రాయ సేకరణ చేయాలనీ వీటన్నిటిని నమోదు చేసి డాక్యుమెంటరీ ని తయారు చేసి ప్రభుత్వానికి పంపాలని సూచించారు. జిల్లాలో గుర్తించిన 290 క్లస్టర్ల లో బేసిక్ సర్వే వెంటనే ప్రారంభించాలని, సర్వే అనంతరం సెప్టెంబర్ నెలాఖరు లోగా రైతుల నమోదు పూర్తి కావాలని, ఈ రబీసీజన్ నాటికి రైతులను సిద్ధం చేయాలని సూచించారు.

జిల్లాలో 60వేల ఎకరాల్లో సాగులో నున్న ప్రకృతి వ్యవసాయంలో పంటల వారీగా వివరాలను సమర్పించాలని డిపిఎం కు సూచించారు. పశు సంవర్ధక శాఖ ద్వారా జిల్లాలో పాడి పశువుల వివరాలను సేకరించి జాబితాను అందజేయాలని జెడికి సూచించారు. మత్స్య శాఖ ద్వారా ఫారం పాండ్స్ లో ఫిషింగ్ కల్చర్ చేయడానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో జెసి సేతు మాధవన్, జిల్లా వ్యవసాయ అధికారి తారక రామారావు, ప్రకృతి వ్యవసాయం డిపిఎం ఆనంద రావు, డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాస రావు , మత్స్యశాఖ డి డి విజయ్‌కృష్ణ, వ్యవసాయ శాఖ ఎడిలు పాల్గొన్నారు. సమావేశం అనంతరం ప్రకృతి వ్యవసాయ పంటలలో పురుగులు, తెగుళ్ల యాజమాన్య దీపిక, సంక్షిప్త మార్గదర్శిని, 9 సార్వత్రిక సూత్రాలు అనే పుస్తకాలను ఆవిష్కరించారు.

69 ఎకరాల్లో ఆక్వాకల్చర్‌కు అనుమతి : కలెక్టర్

జిల్లాలో ఆక్వాకల్చర్ సాగును పెంచేందుకు గజపతినగరం,బొండపల్లి మండలాల్లో సుమారు 69 ఎకరాలకు జిల్లా స్థాయి కమిటీ ఆమోదం తెలిపిందని జిల్లా కలెక్టర్ బి ఆర్ అంబేద్కర్ తెలిపారు. జిల్లాలో ఆక్వా సాగు పై జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ ఛాంబర్ లో జరిగింది. ఈ సందర్భం గా జిల్లా కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ జిల్లా లో సుమారు 7900 చెరువులు ఉన్నాయని, సొసైటీలతో సంప్రదించి ఎక్కువ విస్తీర్ణం లో ఆక్వా సాగుకు కృషి చేయాలని అన్నారు. ఆక్వా సాగుకు అనువైన మండలాలు గుర్తించేందుకు తహశీల్దారకు ఆదేశించి వారంలో నివేదిక అందజేయాలని డిఆర్‌ఒను ఆదేశించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ ఉప సంచాలకులు విజయ్ కష్ణ, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి వెంకటేశ్వర రావు , వివిధ మండలాల ఆక్వా రైతులు పాల్గొన్నారు.

తీర్మానాల ఫ్లెక్సీతో నిరసన తెలుపుతున్న నిర్వాసితులు

ఆ భూమిని నిర్వాసితులకు ఇవ్వాల్సిందే

సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ప్రజాభిప్రాయ సేకరణలో, గ్రామ పంచాయతీ చేసిన తీర్మానాల్లో ఒక్కటీ అమలు చేయలేదని, జిందాల్ భూములను తిరిగి నిర్వాసితులకు ఇవ్వాలని సిపిఎం నాయకులు చల్లా జగన్ డిమాండ్ చేశారు. మండలంలోని బొడ్డవరలో జిందాల్ పరిశ్రమ భూసేకరణ సందర్భంగా చేసిన తీర్మానాలతో ఫ్లెక్సీని నిర్వాసితులు ప్రదర్శిస్తూ శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములు ఇచ్చిన నిర్వాసితులకు, తాటిపూడి రైతాంగానికి నష్టం చేసే జిఒ 14ను వెంటనే రద్దు చేయాలన్నారు. బొడ్డవర- తాటిపూడి రోడ్డును ఆనుకొని ఉన్న విలువైన భూములను జిందాల్ పరిశ్రమ పేరుతో దళిత, గిరిజనులను మాయ చేసి సేకరించి, ఇండస్ట్రియల్ రియల్ ఎస్టేట్ చేయడానికి సిద్ధపడటం దారుణమన్నారు. భూములిచ్చిన రైతులకు ఉద్యోగాలు లేక, ఉపాధి దొరక్క ఒక తరమే నష్టపోవాల్సి వచ్చిందన్నారు. న్యాయ సూత్రాల ప్రకారం నిర్వాసితుల భూమి తిరిగి వెంటనే అప్పగించాలని డిమాండ్‌చేశారు.

పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌పి తనిఖీ

ప్రజాశక్తి-బొబ్బిలి

క్రైమ్ ప్రాపర్టీ వాహనాలను పరిశీలిస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్

స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఎస్‌పి వకుల్ జిందాల్ శుక్రవారం తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా పోలీస్ స్టేషన్‌ను సందర్శించినట్లు ఎస్‌పి చెప్పారు. క్రైమ్ పాపర్టీ ద్విచక్ర వాహనాలను పరిశీలించారు. రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ వినాయక ఉత్సవాలలో గొడవలు, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిఎస్‌పి భవ్యరెడ్డి, పట్టణ సిఐ కె.సతీష్ కుమార్‌కు సూచించారు.

అధికారుల దృష్టికి రైల్వే సమస్యలు : ఎమ్‌పి

ప్రజాశక్తి-విజయనగరంకోట

భువనేశ్వర్‌లో జరుగుతున్న ఈస్ట్‌కోస్ట్ రైల్వేజోనల్ సమావేశంలో పాల్గొన్న ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల ఆంధ్రప్రదేశ్, ఒడిస్సా సరిహద్దు ప్రాంతానికి సంబంధించిన ముఖ్యమైన రైల్వే, రహదారుల, ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణాలు తదితర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల పార్లమెంట్ సమావేశాల్లో కూడా ఈ సమస్యలపై ఎంపీ చర్చించారు. చీపురుపల్లి-రాజాంను కలిపే చీపురుపల్లి ఆర్‌ఒబిని వెంటనే పూర్తి చేయాలని కోరారు. కోణార్క్ ఎక్స్‌ప్రెస్, ఫలుక్‌నుమా ఎక్స్‌ప్రెస్, యశ్వంతపూర్ ఎక్స్‌ప్రెస్, బిబిఎస్‌లకు అవసరమైన స్టాప్‌లు ఇవ్వాలని, తిరుమల ఎక్స్‌ప్రెస్, గోదావరి ఎక్స్‌ప్రెస్‌లను విజయనగరం వరకు పొడిగించాలని కోరారు. విజయనగరం , శ్రీకాకుళం జిల్లాల స్టేషన్లలో సౌకర్యాలు మెరుగుపర్చాలని కోరారు.

కస్పా స్కూల్ విద్యార్థికి ప్రతిభా పురస్కారం

విజయనగరం టౌన్ : నగరపాలక ఉన్నత పాఠశాల (కస్పా) విద్యార్థి ఆర్.శివాజీ టెన్త్‌లో 584 మార్కులు సాధించినందుకు గాను హైదరాబాద్‌కు చెందిన గొర్తి ఈశ్వర ట్రస్టు శుక్రవారం పూర్వ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.రఘువర్మ చేతుల మీదుగా రూ.25వేలు నగదు పురస్కారాన్ని అందజేసింది. ట్రస్టు వ్యవస్థాపకులు పవన్ కుమార్, ఆయన సతీమణి ఉషాబాల వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఈ ట్రస్టును ప్రారంభించి ఏటా నగదు పురస్కారాలు అందిస్తున్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు చప్ప అప్పలనాయుడు మాస్టర్ నాయుడు, కస్పాహైస్కూల్ ప్రధానోపాధ్యాయిని ఉల్లి విశాలాక్షి, గణిత ఉపాధ్యాయులు, జివిబి యస్‌యన్ రాజు పిల్లలు పాల్గొన్నారు.

ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో

గిరిజన మహిళ ప్రసవం

పురుడు పోసిన పెద్ద కుమార్తె

ప్రజాశక్తి -బొబ్బిలిరూరల్

బిడ్డతో ఉన్న పార్వతి

బొబ్బిలి ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఓ గిరిజన మహిళ ప్రసవించింది. ఆమెకు తన పెద్ద కుమార్తె పురుడు పోసింది. ఇంతకీ ఏం జరిగిందంటే..?

మండలంలోని గోపాలరాయుడుపేట పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామమైన అక్కేనవలసకు చెందిన దుబ్బాక లక్ష్మణ భార్య పార్వతి.. రామభద్రపురం మండలం రొంపిల్లి గ్రామంలోని పామాయిల్ తోటలో పనిచేస్తోంది. శుక్రవారం పురిటి నొప్పులు రావడంతో ఆటోలో బొబ్బిలి ఆసుపత్రికి వస్తున్నారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ దగ్గరకు వచ్చేసరికి నొప్పులు ఎక్కువ అవడంతో సమీపంలోని ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలోకి వెళ్లారు. పెద్ద కుమార్తె సహాయంతో ఆమె ఆరో కాన్పుగా ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అక్కడే ఉన్న జర్నలిస్టులు 108 వాహనానికి సమాచారం ఇచ్చి, తల్లి బిడ్డలను స్థానిక సిహెచ్‌సికి తరలించారు. ఆమెకు నలుగురు అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలు జన్మించారు. ఈ విషయమై సిహెచ్‌సి సూపరింటెండెంట్ జి.శశిభూషణరావు మాట్లాడుతూ అవగాహన లేకపోవడంతో మార్గం మధ్యలో ఆటో దిగిపోయారని చెప్పారు. నేరుగా ఆసుపత్రికి వస్తే ఆందోళన పడకుండా ప్రసవం జరిగేదన్నారు. అయినప్పటికీ తల్లిబిడ్డలు ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు.

బస్సులో సీటు కోసం

చెప్పలతో కొట్టుకున్నారు

ప్రజాశక్తి-బొబ్బిలి

చెప్పలతో కొట్టుకుంటున్న ప్రయాణికులు

ఆర్‌టిసి బస్సులో సీటు కోసం ఇద్దరు ప్రయాణికులు చెప్పులతో కొట్టుకున్న సంఘటన బొబ్బిలి ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో చోటుచేసుకుంది. పార్వతీపురం డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సు విశాఖపట్నం వెళ్లేందుకు బొబ్బిలి కాంప్లెక్స్‌లో శుక్రవారం ఆగింది. బస్సు సీటు కోసం ఒక మహిళ తన చున్నీ వేయగా... ఆ చున్నీ సీటులో లేకుండా కింద పడిపోయింది. దీంతో ఒక వ్యక్తి సీటులో కూర్చున్నాడు. ఆ మహిళ 'ఆ సీటుపై చున్నీ వేశాను, లెగండి' అని అడగ్గా, సీటుపై చున్నీ లేదని ఆ వ్యక్తి సమాధానం ఇచ్చాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుని, చెప్పులతో కొట్టుకున్నారు. చివరికి ఆ వ్యక్తి సీటు ఖాళీ చేసి మహిళకు ఇచ్చేశాడు. వ్యక్తిపై మహిళ దురుసుగా ప్రవర్తించిందని తోటి ప్రయాణికులు చెబుతున్నారు. ఇటువంటి సంఘటనలు జరగకుండా చూడాలని ఆర్‌టిసి అధికారులను కోరారు.

మద్యం బార్లకు ముగిసిన దరఖాస్తులు

నేడు కలెక్టరేట్ సమావేశ మందిరంలో డ్రా

ప్రజాశక్తి- కంటోన్మెంట్

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన బార్ పాలసీ 2025- 2028 లో భాగంగా మద్యం బార్‌ల ఏర్పాటుకు దరఖాస్తుల స్వీకరణ శుక్రవారం తో ముగిసింది. శనివారం ఓపెన్ కేటగిరి , గీత కులాలు సంబంధించిన బార్లు లాటరీ పద్ధతిలో కలెక్టర్ సమక్షంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో డ్రా తీయనున్నారు. జిల్లాలో ఓపెన్ కేటగిరి బార్లు ఏర్పాటుకు 51 దరఖాస్తులు, గీత కార్మికులకు కేటాయించిన మూడు బార్లకు 21 దరఖాస్తులు, పార్వతీపురం మన్యం జిల్లాలో ఓపెన్ కేటగిరిలో బార్‌లకు 9, గీత కార్మికుల కోటాలో 10 దరఖాస్తులు వచ్చాయి. ఒక బార్ కు నాలుగు కంటే ఎక్కువ దరఖాస్తులు వచ్చిన వాటికే లాటరీ తీయనున్నారు. విజయనగరంలో 14 బార్లు, పార్వతీపురం జిల్లాలో నాలుగు బార్లకు లాటరీ ప్రక్రియ చేపట్టనున్నట్లు ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీ నాథుడు తెలిపారు.

డిగ్రీ కళాశాలకు భవనాల పరిశీలన

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం స్థానిక ఇవిఎం గోదాముల వద్దనున్న పలు ప్రభుత్వ భవనాలను శుక్రవారం కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పరిశీలించారు. డిగ్రీ కళాశాల యాజమాన్యం విజ్ఞప్తి మేరకు ఇక్కడి పాత డ్వామా కార్యాలయ భవనాన్ని, పక్కనే ఉన్న ఐసిడిఎస్ ప్రాజెక్టు భవనాన్ని, పరిసర ప్రాంతాన్ని సందర్శించారు. అక్కడి వసతులు, గదులు, రవాణా ఇతర సదుపాయాలపై కలెక్టర్ ఆరా తీశారు. తనిఖీల్లో డిఆర్‌ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, నెల్లిమర్ల తాహశీల్దార్ శ్రీకాంత్, ఇతర అధికారులు, కళాశాల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇవిఎం గోదాముల తనిఖీ

స్థానిక ఈవిఎం గోదాములను కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తనిఖీ చేశారు. గోదాములకు, గదులకు వేసిన సీళ్లను పరిశీలించారు. సిసి కెమేరాలను పర్యవేక్షించారు. అప్రమత్తంగా ఉండాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. తనిఖీల్లో డిఆర్‌ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ భాస్కర్రావు, నెల్లిమర్ల తాహశీల్దార్ శ్రీకాంత్, డిటి జగన్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల కోసం భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అంబేద్కర్

పురస్కారాన్ని అందుకుంటున్న కమిషనర్ నల్లనయ్య

కమిషనర్‌కు గిడుగు పురస్కారం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక కమిషన్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని ఉడా చిల్డ్రన్స్ థియేటర్ లో నిర్వహించిన సభలో నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్యకు గిడుగు రామ్మూర్తి పురస్కారంతో సత్కరించారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ కలసి నల్లనయ్యకు పురస్కారంతో పాటు, జ్ఞాపిక, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నల్లనయ్య మాట్లాడుతూ తెలుగు భాషకు గొడుగు పట్టిన గిడుగు రామ్మూర్తి ఆశయ సాధనకు ఎందరో కృషిచేశారని, అదే ఒరవడిలో తన వంతు సహకారంగా గేయ రచనలు చేస్తూ తెలుగు భాషాభివృద్ధికి కషి చేస్తున్నానని తెలిపారు. గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఈ రోజున పురస్కార ప్రదానం చేయడం మరువలేనిదని అన్నారు. ప్రతి ఇంట తెలుగు పరిఢవిల్లాలని ఆకాంక్షించారు.

మొండిబకాయిలు చెల్లించాలి

లేదంటే ఆస్తులు జప్తు : డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున

ప్రజాశక్తి-విజయనగరంకోట

డిసిసిబిలో రుణాలు తీసుకొని ఎవరైతే మొండిగా వ్యవహరిస్తున్నారో వారంతా సెప్టెంబర్ నెలలోపు చెల్లించాలని, లేదంటే వారి ఆస్తులను జప్తు చేస్తామని డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. శుక్రవారం డిసిసిబి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసిసిబిని లోతుగా అధ్యయనం చేశానని, బడా బాబులే ఎక్కువ శాతం రుణాలు తీసుకొని బకాయిలు చెల్లించలేదని తెలిపారు. డిపాజిట్లు సేకరణకు కృషి చేసి డిసిసిబిని సంస్థాగతంగా బలోపేతం చేస్తామన్నారు. రైతాంగం బాగుపడాలంటే సహకార రంగం బలోపేతం కావాలన్నారు. ఇందుకోసం తక్కువ వడ్డీకే రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. సోలార్ సూర్యఘర్ పథకం ద్వారా సోలార్ ఏర్పాటు చేసుకునేందుకు 80శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. చిన్న చిన్న రౌడీ మూకలు బ్యాంక్ సిబ్బందిపై దౌర్జన్యం చేస్తే పోలీసు కేసులు పెట్టవలసి వస్తుందని హెచ్చరించారు.

వృద్ధులకు సౌకర్యాలు కల్పించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

వయో వృద్ధులకు కావలసిన అన్ని సౌకర్యాలు కల్పించాల్సిన అవసముందని జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయి వయోవృద్ధుల కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వయోభారం తో ఉన్న వారి కనీస అవసరాలైన నివాసం, ఆహారం, దుస్తులు, మందులు సమకూర్చే ఏర్పాట్లు చేయాలని హితవుపలికారు. మూడేళ్లకొకసారి వయోజనుల అవరాసరాలకు కోసం కొత్త కమిటీ ఏర్పాటు అవసమై ఉన్నందున ఈ ఏడాది చివరి త్రైమాసిక కమిటీ సమావేశం కలెక్టర్ ఛాంబర్ లో జరిగింది. ఈ సందర్భంగా విభిన్న ప్రతిభావంతులు సహాయ సంచాలకులు కమిటీ ఉద్దేశ్యాన్ని వివరిస్తూ ఇప్పటివరకు జిల్లా లో వయోవృద్ధుల సమస్యలు, పోషణ చట్టంపై 23 అర్జీలు వచ్చాయని వివరించారు. ఇప్పటివరకు 11 వేల గుర్తింపు కార్డులు జారీ చేసి రాష్ట్రం లో ప్రథమ స్థాయి లో నిలిచించిందని కలెక్టర్ తెలిపారు. నగరపాలక సంస్థ ప్రాంతాల్లో వయోవృద్ధుల చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఫ్లెక్సీలు, పోస్టర్లు రూపంలో ప్రజలకు విస్తత ప్రచారం చేయాలని తెలిపారు. వయోవృద్ధుల సంక్షేమ సంఘం భవనం, ఫిజియోథెరపీ సెంటర్ కొరకు అనువైన ప్రాంతాన్ని గుర్తించి నివేదిక సమర్పించాలని డిఆర్‌ఒకు ఆదేశించారు. సమావేశంలో జెసి సేతుమాధవన్, డిఎస్‌పి వీరకుమార్, విభిన్న ప్రతిభావంతుల అసిస్టెంట్ డైరెక్టర్ ఆశయ్యా, డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాస్, డిఎంహెచ్‌ఒ డాక్టర్‌జీవనరాణి తదితరులు పాల్గొన్నారు.

గురుప్రసాద్‌కు తెలుగు కీర్తి పురస్కారం

ప్రజాశక్తి- కంటోన్మెంట్

గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయంలో జరిగిన జాతీయ తెలుగు సాంస్కృతిక వైభవ ఉత్సవంలో రచయిత, సాహితీవేత్త సముద్రాల గురు ప్రసాద్‌కు తెలుగు కీర్తి పురస్కారాన్ని హర్యానా పూర్వ రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ అందజేశారు. కార్యక్రమంలో మాజీ కేంద్రమంత్రి సముద్రాల వేణుగోపాల చారి, గిడుగు రామమూర్తి మనుమడు గిడుగు వెంకట రామకృష్ణారావు, భక్త రామదాసు పదవతరం వారసులు కంచెర్ల శ్రీనివాసరావు, నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా మూడవ తరం వారసులు డాక్టర్ బి.ఆర్ సుశీల్ కుమార్, ప్రముఖ కవయిత్రి మొల్ల ఎనిమిదవ తరం వారసులు డాక్టర్ శివ శంకరయ్య, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ శ్రీనివాస్ వాసుదేవ్, డాక్టర్ అద్దంకి రాజా, చిలుముల బాల్ రెడ్డి పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది కోసం ఎదురుచూస్తున్న గ్రామస్తులు

మీ రాక కోసమని..

సమయపాలన పాటించని సారిపల్లి సచివాలయ సిబ్బంది

ప్రజాశక్తి-నెల్లిమర్ల

సారిపల్లి సచివాలయ సిబ్బంది రాక కోసం దరఖాస్తుదారులు ఎదురు చూసే పరిస్థితి ఏర్పడింది. సారిపల్లి సచివాలయం శుక్రవారం ఉదయం 10 గంటలకు తెరిచి ఉన్నప్పటికీ 11గంటలు దాటినా సిబ్బంది ఎవరూ రాలేదు. దీంతో దరఖాస్తు దారులు, గ్రామస్తులు సచివాలయం బయట వేచి చూడాల్సిన పరిస్థితి ఎదురైంది. గత 3 నెలలుగా ఇన్‌ఛార్జి కార్యదర్శి అదనపు బాధ్యలు చేపట్టారు. పర్మినెంట్ కార్యదర్శి లేకపోవడంతో గ్రామస్తులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదు. ఉన్నతాధికారులు పర్మినెంట్ కార్యదర్శిని నియమించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రజా దర్బార్‌కు వినతులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి గజపతిరాజు తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుండి వచ్చిన వినతులను స్వీకరించి వారి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, విజయనగరం మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, జొన్నవలస, రాకోడ ఎంపిటిసిలు రెడ్డి, బాబు, వేచలపు శ్రీనివాసరావు, నియోజకవర్గ మండల నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్సీ గ్రీష్మ

ప్రజాశక్తి- సంతకవిటి

సంతకవిటి మండలం కావలి గ్రామానికి చెందిన ఎమ్మెల్సీ, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కావలి గ్రీష్మ ప్రసాద్ శుక్రవారం ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో జరుగుతున్న సదస్సులో పాల్గొన్నారు. ఈ మేరకు లోకసభ స్పీకర్ ఓం బిర్లా ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో గ్రీష్మ ప్రసాద్ ఎస్‌సి, ఎస్‌టిల సమస్యలను ప్రస్తావించారు.

వీనుల విందుగా గాత్ర కచేరీ

ప్రజాశక్తి-విజయనగరం కోట

మహారాజ ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో గాత్ర కచేరీలు వీనుల విందుగా సాగుతున్నాయి. సంగీత నృత్య మహోత్సవాల సందర్భంగా గాత్ర కచేరీలు నిర్వహించారు. జి. రాధా కుమారి, సిహెచ్ రామచంద్రశేఖర్, విజయవాడకు చెందిన మూల శ్రీలత గాత్ర కచేరీలు చేశారు. వీరికి వి.సురేష్‌కుమార్, వి.గణేష్, ఎం.సత్యనారాయణ శర్మ, డాక్టర్ మండపాక రవి మృదంగం, వయొలిన్ తో సహకరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మండపాక నాగలక్ష్మి సిబ్బంది పాల్గొన్నారు.

యూ ట్యూబ్ ఛానల్ పోస్టర్ రిలీజ్

ప్రజాశక్తి- కంటోన్మెంట్

ఎస్‌ఆర్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో.. అందాల మహారాజా ఫోక్ సాంగ్ శ్రీను రుపా 5825 అనే యూట్యూబ్ ఛానల్ పోస్టర్‌ను చిన్న శీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరిసహస్ర శుక్రవారం రిలీజ్ చేశారు. కార్యక్రమంలో పాట రచన పడాల చెల్లయ్య, సంగీతం సోల్మన్‌రాజు (మాత రికార్డింగ్ స్టూడియో) గాయని గాయకులు డి. లత, పడాల చెల్లయ్య, నటీ నటులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో సింగరాయి గ్రామంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రవికుమార్ ఆధ్వర్యాన స్మార్ట్ రేషన్ కార్డులను శుక్రవారం పంపిణీ చేశారు. స్వమిత్ర కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సభ్యులు ఈశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి సత్యవతి పాల్గొన్నారు.

లోకేష్‌ని కలిసిన సువ్వాడ దంపతులు

మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సువ్వాడ

ప్రజాశక్తి-నెల్లిమర్ల

విశాఖపట్నంలో శుక్రవారం మంత్రి నారా లోకేష్‌ని టిడిపి విశాఖ నార్త్ నియోజకవర్గ పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్, మాజీ ఎంపిపి సువ్వాడ వనజాక్షి దంపతులు మర్యాద పూర్వకంగా కలిశారు. సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చినందుకు మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి, కృతజ్ఞతలు తెలిపారు.

వ్యవసాయ డ్రోన్లతో రైతులకు మేలు

ప్రజాశక్తి-వంగర

డ్రోన్‌ను అందజేస్తున్న ఎఒ కన్నబాబు

వ్యవసాయంలో డ్రోన్లు వినియోగం వల్ల రైతులకు ఎంతో మేలని మండల వ్యవసాయ అధికారి తట్టికోట కన్నబాబు అన్నారు. మండలంలోని పెద్దరాజులు గుమ్మడ గ్రామంలో ఓం గణపతి రైతుమిత్ర గ్రూపునకు వ్యవసాయ డ్రోన్‌ను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌బిఐ వంగర బ్రాంచి ఫీల్డ్ ఆఫీసర్ నరేష్, డ్రాగో కంపెనీ ప్రతినిధి సాయి, విఎఎ సుకన్య పాల్గొన్నారు.

భారీ అన్న సంతర్పణ

అన్నదానం చేస్తున్న ఎంపిటిసి పాలవలస గౌరు

ప్రజాశక్తి-బాడంగి

మండలంలోని ఎరుకులపాకలు గ్రామంలో వినాయక ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గజరాయునివలస ఎంపిటిసి పాలవలస గౌరు, లక్ష్మీపురం సర్పంచి పాలవలస పార్వతి ఆధ్వర్యాన భారీ అన్న సంతర్పణ నిర్వహించారు.

పాముకాటుతో మహిళ మృతి

ప్రజాశక్తి-గంట్యాడ

మండలంలోని దిగువకొండపర్తి గ్రామంలో పాముకాటుతో ఎర్రబోయిన కొత్తమ్మ (40) మృతి చెందింది. గురువారం తన పూరింట్లోనే ఆమెను పాము కాటేసింది. స్థానికులు ఆమెను వెంటనే శృంగవరపుకోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆమె భర్త కొన్నేళ్ల క్రితం మరణించాడు. ఆమెకు 16 ఏళ్ల కుమార్తె అనిత ఉంది. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సాయికృష్ణ తెలిపారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో యువతికి వేధింపులు

ప్రజాశక్తి- కంటోన్మెంట్

ఇన్ స్టాగ్రామ్ లో ఫేక్ ఐడి సృష్టించి యువతిని వేధిస్తున్నట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు విజయనగరం వన్ టౌన్ సిఐ ఆర్.వి.ఆర్.కె చౌదరి తెలిపారు. పట్టణంలోని కెఎల్‌పురానికి చెందిన యువతిని ఇన్ స్టా గ్రామ్ లో ఒక వ్యక్తి వేధిస్తున్నట్లు యువతి తండ్రి సాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు

తెలుగు భాషను కాపాడుకుందాం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తెలుగు భాషను కాపాడుకుందామని వక్తలు పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా తెలుగు భాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని ఫోర్టు సిటీ సిటీ పాఠశాలలో గిడుగు వెంకట రామమూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం, ధ్యానచంద్ జయంతి సందర్భంగా క్రీడాదినోత్సవాలను ఘనంగా జరిగాయి. తెలుగుభాషా వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, వకృత్వం, పాటలు వేషాధారణ తదితర అంశాల్లో పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుతులు అంద జేశారు. క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు కూడా బహుమతులు అందజేశారు. పాఠశాల చైర్మన్ కె.ఎ.పి. రాజు(శివ) తెలుగు భాష, గొప్పతనం, క్రీడల ప్రయోజనాలు గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ చైర్మన్ చంటి, ప్రిన్సిపల్ డాక్టర్ రియినాఖాన్, డైరెక్టర్లు మధు అశీక్, నీలిమ, తెలుగు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవం ఘనంగా జరిగాయి. జిల్లా ఖోఖో అసోసియేషన్ చైర్మన్ పి.చిన్నంనాయుడు, సత్య కళాశాల తెలుగు అధ్యాపకులు ఎంవి కృష్ణమూర్తి, విశాఖ సంస్కృతి పత్రికా సంపాదకులు శిరేల సన్యాసిరాఇవు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ్ రావు, ప్రిన్సిపాల్ డివి రామమూర్తి మాట్లాడారు. ఈ సందర్భంగా క్విజ్ పోటీలు, క్రీడా పోటీలు, వ్యాసరచన పోటీలు మరియు ప్రదర్శనలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

- జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వారోత్సవాల్లో భాగంగా తెలుగుభాషా దినోత్సవాన్ని శుక్రవారం అక్షరాల దేవాలయం, మహాకవి గురజాడ గృహంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా చిరంజీవి యువత, జనసేన సేవాదళ్ ఆధ్వర్యంలో జిల్లా చిరంజీవి యువత అధ్యక్షులు త్యాడరామకృష్ణారావు(బాలు) నిర్వహించారు. తొలుత తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటానికి, మహాకవి గురజాడ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

కొత్తవలస : వీరభద్రపురంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి, మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాసరావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

బొబ్బిలి : పట్టణంలో గిడుగు రామమూర్తికి, కళాభారతి వద్దనున్న తెలుగు తల్లి విగ్రహానికి కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జెసి రాజు పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి చిత్రపటాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎస్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ బొంతు శ్రీరాములు, కారుణ్య కార్యదర్శి సిహెచ్ ప్రవీణ్ కుమార్, చిన్నారావు, సామాజిక కార్యకర్తలు అప్పల నాయుడు, సోమేశ్వరరావు, ఉమామహేశ్వర రావు పాల్గొన్నారు.

రామభద్రపురం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా, క్రీడా దినోత్సవాలను ప్రధానోపాధ్యాయులు గోపాల నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయుడు దాలినాయుడు, పాఠశాల ఉపాధ్యాయ కార్యదర్శి ప్రభాకరరావు, పీడీ శ్రీదేవి, పిఇటి రామారావు పాల్గొన్నారు.

విజయనగరంకోట : గాజులరేగలోని నారాయణ పబ్లిక్ స్కూలులో తెలుగు భాషా దినోత్సవం జరిగింది. 7వ తరగతి విద్యార్థి సిహెచ్. సిద్ధార్థ నాయుడు గిడుగు రామ్మూర్తి వేషధారణలో ఆకట్టుకున్నాడు. తెలుగు ఉపాధ్యాయిని బి శిరీష ఆధ్వర్యంలో విద్యార్థులు పలకలపై గిడుగు తెలుగు పిడుగు అని అక్షర క్రమంలో రాసి తెలుగును పరిరక్షించుకుందామని నినదించారు. పాఠశాల కరస్పాండెంట్ నారాయణరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బొబ్బిలిలో తెలుగు తల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జెసి రాజు

వేపాడ : సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా, తెలుగు భాషా దినోత్సవాలను హెచ్‌ఎం బిపిఎ రాజు ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాలు వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్.గోవిందరావు, ఉపాధ్యాయులు వి.జగన్నాథం, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. మోడల్ స్కూల్లో ప్రిన్సిపల్ రావాడ ఈశ్వరరావు ఆధ్వర్యాన తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

నెల్లిమర్ల : డైట్ కళాశాలలో గిడుగు రామ్మూర్తి, మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటాలకు ప్రిన్సిపల్ కె.రామకృష్ణారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార అవార్డు గ్రహీత ఎస్.బాల సుధాకర్ మౌళి రచనా ప్రక్రియలు, కవిత్వం ఛాత్రోపాధ్యాయులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కంచుపల్లి అప్పారావు, పతివాడ సూర్యారావు, కాళ్ల అప్పారావు, స్టాఫ్ సెక్రటరీ వి.చిన్నంనాయుడు, సూపరింటెండెంట్ కమలకుమారి పాల్గొన్నారు. పారసాం హైస్కూల్లో ఎంఇఒ యుఎస్ఎన్ మూర్తి, హెచ్‌ఎం సిద్ధాంతం త్రినాథ్ తెలుగు భాష, క్రీడా దినోత్సవాలను ప్రారంభించారు.

లక్కవరపుకోట : చందులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవాలను వ్యాయామ ఉపాధ్యాయులు పొట్నూరు శ్రీరాములు, తెలుగు ఉపాధ్యాయులు బరినికాని వెంకట్రావు, చక్రధర్ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు, పిరమిడ్ ప్రదర్శన ఆకట్టుకున్నాయి. ప్రధానోపాధ్యాయులు సగుబండి శివరామకృష్ణ, చిన్నంనాయుడు, స్టాఫ్ సెక్రటరీ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

కొత్తవలస.. వీరభద్రపురం పాఠశాలలో గిడుగు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ; వేపాడ.. ఆదర్శ పాఠశాలలో తెలుగు తల్లి వేషధారణలో విద్యార్థులు

సిఎం సహాయనిధి చెక్కులు అందజేత



సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు

ప్రజాశక్తి-డెంకాడ

సిఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు అందజేశారు. భోగాపురం మండలం పోలిపల్లిలోని తన నివాసం వద్ద చెక్కులను పంపిణీ చేశారు. పూసపాటిరేగ మండలం సిహెచ్ అగ్రహారం గ్రామానికి చెందిన గుడివాడ రామారావుకు రూ.76,061, వెల్దూరు గ్రామానికి చెందిన దారపు పెంటయ్య రెడ్డికి 74,050, డెంకాడ మండలం టి.తాళ్లవలస గ్రామానికి చెందిన చొప్ప వరహాలుకు రూ.1,28,948 చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పూసపాటిరేగ మండల అధ్యక్షులు మహంతి శంకరరావు, పార్లమెంట్ ఉపాధ్యక్షులు ఆకిరి ప్రసాదరావు, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి పతివాడ విద్యాసాగర్ నాయుడు, టిడిపి నాయకులు మైలపల్లి సింహాచలం, భూలోకం, ఆట్టాడ శ్రీను పాల్గొన్నారు.

వినతులు స్వీకరణ

పోలిపల్లిలోని తన నివాసం వద్ద మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించి, ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అర్జీలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బంగార్రాజు తెలిపారు.

మహిళా సంక్షేమం కూటమితోనే సాధ్యం

ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

ప్రజాశక్తి-రాజాం

మహిళా సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. రాజాం పట్టణంలోని మార్కెట్ యార్డులో శుక్రవారం నిర్వహించిన 'స్త్రీ శక్తి' విజయోత్సవ సభలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు నేడు సూపర్ హిట్ అవుతున్నాయని తెలిపారు. మహిళలకు సాధికారత మాత్రమే కాదు తిరుగులేని సంక్షేమం కూడా కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అందజేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో తూర్పు కాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ కె.అప్పలనాయుడు, గురవాన నారాయణ రావు, సుమల వెంకట మన్మధరావు, కిమిడి అశోక్ కుమార్, దూబ ధర్మారావు, లచ్చుభుక్త కృష్ణమూర్తి, టంకాల కన్నం నాయుడు, గణపతి, ఎం.శ్రీను, తెలుగు మహిళా పార్లమెంటరీ అధ్యక్షులు మంతిన ఉషారాణి, ఉత్తరావెల్లి భవాని, రాజాం, రేగిడి, వంగర మండల మహిళా సమాఖ్యల అధ్యక్షులు రౌతు వెంకటమ్మ, పల్లి జ్యోతి, బెవర రామలక్ష్మి, బత్తిన శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎంఎస్ అధ్యక్షులను అభినందిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

స్పందించారు.. దాడులు చేపట్టారు

ప్రజాశక్తి కథనానికి స్పందన

తనిఖీలు చేపడుతున్న ఎక్సైజ్ సిబ్బంది

ప్రజాశక్తి - గజపతినగరం

'ప్రజాశక్తి'లో శుక్రవారం ప్రచురితమైన 'మద్యం అమ్మకాలకు అడ్డదారులు' అనే కథనానికి ఎక్సైజ్ అధికారులు స్పందించారు. మండలంలో పిడిశీల, కాలంరాజుపేట, సీతారాంపురం గ్రామాల్లో సిఐ జె.జనార్దనరావు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. సీతారాంపురంలో 9 మద్యం సీసాలతో కలగర్ల సత్యారావు అనే వ్యక్తి పట్టుబడ్డాడు. ఆయనపై కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు. ఇప్పటివరకు 135 మంది బెల్ట్‌షాపుల నిర్వాహకులపై కేసులు నమోదు చేసి, 251.28 లీటర్ల మద్యం, 6.5 లీటర్ల బీర్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా బెల్ట్‌షాపుల నిర్వహణ, వేలం పాటలు నిర్వహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం దుకాణాలను ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎంఆర్‌పి కన్నా అదనంగా ఏ మద్యం షాపులోనైనా అమ్మితే 9440902367 ఫోన్ నెంబర్‌కి లేదా టోల్ ఫ్రీ నంబర్లకు ఫిర్యాదు చేయాలని కోరారు. దాడుల్లో ఎస్ఐ పి.నరేంద్రకుమార్, హెచ్‌సి జె.భాష, కానిస్టేబుల్ ఎ.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అవయవ దానానికి అంగీకారం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

జరజాపుపేటకు చెందిన సాధన యువజన సంఘం అధ్యక్షులు పోలుబోతు దుర్గాప్రసాదరావు, లక్ష్మి దంపతుల కుమార్తె చి.జేస్మితశ్రీ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం ఆ దంపతులిద్దరూ నేత్ర, అవయవ దానానికి అంగీకారం తెలిపారు. తొలుత స్థానిక జిల్లా రెడ్‌క్రాస్ నైట్ షెల్టర్‌లో వృద్ధులకు అల్పాహారం ఏర్పాటుచేశారు. దుర్గాప్రసాద్ 67వ సారి రక్తదానం చేశారు. అనంతరం ఇరువురు దంపతులు నేత్ర, అవయవ దానానికి అంగీకరిస్తూ ఒప్పంద పత్రాలను ఆశ్రయ బ్లడ్ డోనార్స్ అధ్యక్షులు బొడ్డేపల్లి రామకృష్ణారావుకు అందజేశారు. దీంతో ఆ దంపతులను పలువురు అభినందించారు. కార్యక్రమాల్లో రెడ్‌క్రాస్ సభ్యులు బాలు, చేయూత పౌండేషన్ అధ్యక్షులు ముడిదాపు రాము, సాధన యువజన సంఘం ప్రధాన కార్యదర్శి పసుమర్తి వెంకటరమణ, కుటుంబ సభ్యులు వెంకట సూర్యనారాయణ, మనీషా పాల్గొన్నారు.

అవయవ దానానికి అంగీకరిస్తూ పత్రాలు అందజేస్తున్న దుర్గాప్రసాద్ దంపతులు

మాట్లాడుతున్న శాస్త్రవేత్త సుధారాణి

మామిడి రైతులకు అవగాహన

ప్రజాశక్తి-గంట్యాడ

మండలంలోని రామవరం గ్రామంలో మామిడి రైతులకు ఉద్యాన శాఖ అధికారి పి.స్వాతి ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. నూజివీడు మామిడి పరిశోధన స్థానం శాస్త్రవేత్త కె.సుధారాణి రైతులకు అవగాహన కల్పించారు. మామిడి పంటలో ఎరువుల యాజమాన్యం, కోత అనంతరం, ముందు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. ఉద్యాన శాఖ ద్వారా రైతులకు అందించే వివిధ పథకాలు, రాయితీల గురించి తెలియజేశారు. రైతులతో జిల్లా ఉద్యాన శాఖ అధికారి సిహెచ్ చంద్రశేఖర్ ముఖాముఖి మాట్లాడి, వారి సందేహాలను నివృత్తి చేశారు. క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా మామిడి పంట ఎంపికైందని ఆయన చెప్పారు. దీంతో మామిడి రైతులకు మంచి ఆర్థిక ప్రయోజనాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఉద్యాన, వ్యవసాయ కో-ఆపరేటివ్ సొసైటీ ప్రెసిడెంట్, ఎఫ్‌పిఒ బాలాజీ, బోర్డు సభ్యులు డివి రామచంద్రరాజు, లక్కిడాం పిఎసిఎస్ అధ్యక్షులు చుక్క వెంకటరావు, అల్లు విజయకుమార్, హార్టికల్చర్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

ఉచితంగా పిటిషన్ ఫార్మెట్ల పంపిణీ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

న్యాయవాదులు కోర్టులో అత్యవసరంగా దాఖలు చేయాల్సిన వివిధ రకాల పిటిషన్ల ఫార్మేట్లను బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి.సూరిదేముడు పంపిణీ చేశారు. శుక్రవారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులకు పిటిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని శృంగవరపుకోట జూనియర్ సివిల్ జడ్జి బి.కనకలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అసోసియేషన్ అధ్యక్షులు ఉచితంగా సమకూర్చిన పిటిషన్లను సక్రమంగా న్యాయవాదులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి బివిఎస్ రామారావు, ప్రభుత్వ సహాయ న్యాయవాది టివిఆర్ మూర్తి, సీనియర్ న్యాయవాదులు అల్లు సత్యాజీ, నానిగిరి తులసీదాసు, గేదెల ప్రకాష్, వారాది ఈశ్వరరావు, ట్రెజరర్ బి.త్రిమూర్తులు, మీడియా సెక్రటరీ డబ్ల్యు.ఎన్. శర్మ, లైబ్రరీ సెక్రటరీ ఆర్.సత్యనారాయణ, బి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గరివిడిలో 2కె మారథాన్‌లో పాల్గొన్న పశువైద్య కళాశాల విద్యార్థులు

ఘనంగా క్రీడా దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న జాతీయ క్రీడా దినోత్సవం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగింది. ప్రభుత్వ పాఠశాలలు, జెఎన్‌టియు, డైట్ కళాశాలలో క్రీడా పోటీలు నిర్వహించి, అనంతరం క్రీడా వేడుకలు నిర్వహించారు. శారీరక ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ, ఉన్నత స్థాయిలో చేరుకున్న వారి గురించి విద్యార్థులకు వివరించారు.

వ్యాయామ ఉపాధ్యాయులకు సన్మానం

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చిన ఐదు జెడ్ హైస్కూల్స్ వ్యాయామ ఉపాధ్యాయులను జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో ఎక్స్‌లెన్సు అవార్డుతో సత్కరించారు. శుక్రవారం ఓ ప్రైవేటు పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పారాది, బాడంగి, ఆరికతోట, తోంద్రంగి, కారాడ జెడ్‌పి హైస్కూళ్ల వ్యాయామ ఉపాధ్యాయులను డిఇఒ యు.మాణిక్యం నాయుడు సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మన్యం జిల్లా డిఇఒ రాజ్‌కుమార్, సమగ్ర శిక్ష ఎపిసి ఎ.రామారావు, డిప్యూటీ డిఇఒ మోహనరావు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బొబ్బిలి : పాత చక్కెర పరిశ్రమ సమీపంలో ఉన్న వీరబొబ్బిలి క్రీడా మైదానంలో శుక్రవారం క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. బొబ్బిలి స్పోర్ట్స్ రిక్రియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో పోలీస్ ఉద్యోగం సాధించిన క్రీడాకారుడు వి.సత్యనారాయణను క్లబ్ అధ్యక్షుడు రావు శ్రీనివాసరావు సన్మానించారు.

గరివిడి : స్థానిక పశువైద్య కళాశాలలో అసోసియేట్ డీన్ ఎం.శ్రీను అధ్యక్షతన ఆఫీసర్ ఇన్‌ఛార్జి ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ వై.ఆర్ అంబేద్కర్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. 2కె మారథాన్‌లో విద్యార్థులు, బోధన సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు మురళీధర్, వెంకటరావు, గంగునాయుడు, మూల రవి, సుధారాణి, జ్యోతిశ్రీ పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో గిరిజనుల పాత్ర అపూర్వం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమగ్ర సమాజ నిర్మాణంలో గిరిజనుల పాత్ర అపూర్వమైనదని సిటియు ప్రొఫెసర్ జితేంద్ర మోహన్ మిశ్రా అన్నారు. సిటియు సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో, భారతీయ సామాజిక శాస్త్ర పరిశోధన మండలి న్యూ ఢిల్లీ సహకారంతో రెండు రోజుల జాతీయ సదస్సు జరిగింది. గిరిజన నాయకుడు భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి పురస్కరించుకొని జరుగుతున్న ఈ సదస్సు 'గిరిజన జ్ఞాన వ్యవస్థ: సర్దుబాటు మరియు సమగ్రత' అనే ప్రధాన అంశంపై కొనసాగింది. ఈ సందర్భంగా జితేంద్ర మోహన్ మిశ్రా మాట్లాడుతూ గిరిజన జ్ఞాన సంపదను ఆధునిక విద్యా, పరిశోధనలలో అనుసంధానం చేయడం అత్యంత అవసరమని, ఈ తరహా సదస్సులు విద్యార్థులు, పరిశోధకులు, సమాజపౌరులకు ఒక వేదికగా నిలుస్తాయ అని పేర్కొన్నారు. ప్రధాన అతిథి పద్మశ్రీ అవార్డు గ్రహీత చెరువాయల్ రామన్ మాట్లాడుతూ గిరిజనులు ఉపయోగించే మూలికా వైద్యం, ప్రకతి వైద్యం, ఆహార వైద్యం తదితరమైనవి ప్రభావ వంతమైనవి అని, దీనికి మరింత శాస్త్రీయత జోడిస్తే ప్రజలకు మరింత చేరువ అవుతుందని అన్నారు. సామాజిక శాస్త్రవేత్త సీత కక్కోత్, డీన్ ప్రొఫెసర్ శరత్ చంద్రబాబు, సోషల్ వర్క్ విభాగ సహాయ ఆచార్యుడు డాక్టర్ నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-రేగిడి

పాఠశాల విద్యార్థులకు సెప్టెంబర్ 2, 3 తేదీలలో మండల స్థాయిలో నిర్వహించే అండర్ -14, 17 క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఎంఇఒలు వరప్రసాదరావు, గరికయ్య తెలిపారు. ఈ మేరకు శుక్రవారం రేగిడి ఎంఆర్‌సి కార్యాలయంలో పీడీ, పిఇటిలతో సమావేశం ఏర్పాటు చేశారు. విద్యార్థులతో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్ క్రీడా పోటీలు నిర్వహించాలని సూచించారు.

మహారాజశ్రీ బొబ్బిలి సీనియర్ సివిల్ జడ్జ్ వారి కోర్టులో
O.S No. 9/2025

బండి లక్ష్మి ......వాది
తాడ్డి లక్ష్మి @ చీరాల లక్ష్మి (రెడ్డమ్మ)....... ప్రతి వాది
To:
ప్రతివాది :
తాడ్డి లక్ష్మి @ చీరాల లక్ష్మి (రెడ్డమ్మ) w/o లేటు సత్తి రెడ్డి వ॥ 50 సంవత్సరాలు ప్రస్తుతం పూలబాగ్ డోర్ నెం:40-3/12 బొబ్బిలి.

పైన తెలిపిన దావాను మీపై దాఖలు చేసి ఉన్నారు **04.09.2025 తేదీ**న వాయిదాకు ఉన్నది ఆ దినమున శ్రీ కోర్టు వారి ఎదుట **ఉదయం 10:30 నిమిషాల**కు స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని హాజరై మీ దావాను దాఖల పరచుకోవలెను లేనియెడల మీ దావాను పరోక్షముగా పరిష్కరించబడును.

కోర్టు వారు ఆదేశములతో

I.RAMAKRISHNA
Advocate For Plaintiff
(వాది తరుపున అడ్వకేట్)
సెల్ : 9440578400,
బొబ్బిలి

IN THE HON'BLE COURT OF THE APPELLATE AUTHORITY UNDER AP RENT CONTROL ACT CUM SENIOR CIVIL JUDGE COURT AT RAJAM
RCMA NO. 1/2024

Between :
Potta Seetharama Gupta @ Chittibabu .....Appellant
AND
The George Coronation Club, Rajam and 37 Others. .....Respondents

NOTICE

To
Respondent No.30 : వడ్డాది లక్ష్మణరావు తండ్రి లేటు రామమూర్తి, పాన్‌షాప్, ఫ్రూట్ బిజినెస్ కేరాఫ్ ఆకుల అప్పలరాజు, మల్లిఖార్జున కోలనీ, రాజాం - 532127, రాజాం మండలం, పాత శ్రీకాకుళం జిల్లా, ప్రస్తుతం విజయనగరం జిల్లా, ఆంధ్రప్రదేశ్.

Respondent No.36 : బండి శ్రీనివాసరావు, వయసు 28 సం॥లు, ఫ్రూట్ జ్యూస్ షాపు, గవర్నమెంట్ వెటర్నరీ హాస్పటల్ ఎదురుగా, మెయిన్ రోడ్, రాజాం - 532127, రాజాం మండలం, పాత శ్రీకాకుళం జిల్లా, ప్రస్తుతం విజయనగరం జిల్లా, ఆంధ్రప్రదేశ్.

పై నెంబరు అప్పీల్లో అప్పిలెంట్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజాంలో గల RCMA NO. 1/2024 నందు వ్యాజ్యము వేసియున్నారు, మరియు సదరు వ్యాజ్యము రాజాం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, రాజాం వారి O.S.NO.1/2008 డిక్రీ మరియు జడ్జిమెంట్ తే08.08.2024ది Set aside చేయమని సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, రాజాంలో అప్పీల్ చేయగా మీకు నోటీసు నిమిత్తం **తే12.09.2025ది** నాడు వాయిదా అయివున్నది. కావున సదరు వాయిదా నాడు మీరు అనగా పైన పేర్కొనబడిన Respondent No. 30 : వడ్డాది లక్ష్మణరావు తండ్రి లేటు రామమూర్తి, రాజాం మరియు Respondent No.36 : బండి శ్రీనివాసరావు, రాజాం వారలు **ఉదయం గం॥ 10:30 ని॥**లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేట్ గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియజేసుకోవలెను. లేనియెడల శ్రీ కోర్టువారు పై నెంబరు అప్పీల్ను మీ పరోక్షమున తీర్మానించడం జరుగునని ఈ నోటీసు మూలంగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఆర్డరు ప్రకారం)

పి.వి.ఎస్. సీతారామయ్య,
అడ్వకేట్ డో.నెం. 7-3-1,
న్యూకాలనీ, శ్రీకాకుళం.
సెల్: 9848407726